క్లుప్తంగా

అథ్లెట్ జ్యోతికి అభినందన



ఏఎస్ఐ సతీష్‌కు బొకే అందించి సిల్వర్ మెడల్ చూపిస్తున్న జ్యోతి

మర్రిపాలెం: కైలాసపురానికి చెందిన అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ గత నెల చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్ పోటీల్లో పాల్గొని 100 మీటర్ల హర్డిల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఏషియన్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేందుకు కృషితోపాటు పోలీసుల ఎన్‌వోసీ కూడా ఎంతో అవసరం. ఈ ప్రక్రియకు సహకరించిన కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సతీష్‌ను ఆయన చాంబర్‌లో జ్యోతి తన తల్లిదండ్రులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ఇటువంటి క్రీడల్లో పాల్గొని పతకం సాధించడం దేశానికే గర్వకారణమన్నారు. ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ జ్యోతిని అభినందించారు.

అయ్యప్ప స్వాముల సేవలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



అయ్యప్ప పీఠంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట: ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్టు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి సమీపంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ట్రస్టు సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా పీఠంలో అయ్యప్ప స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవని, దీక్షలో ఉన్న స్వాములకు సేవ చేయడం గొప్ప వరంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



ఐదో అంతస్తులోని ఫ్లాట్‌లో తారాజువ్వ పడి చెలరేగిన మంటలు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్ మార్కెట్ పక్కనున్న భవనంలోని ఐదో అంతస్తులో అగ్నిప్రమా దం జరిగింది. వివరాలిలా.. దాలిరాజు సూప ర్ మార్కెట్ వెనుక పోలీస్ అవుట్ పోస్ట్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో యాజమాని ఫ్లాట్ కొనుగోలు చేశారు. కొద్ది రోజుల కిందట ఇంట్లో పాలు పొంగించి వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి దీపావళి బాణసంచా కాల్పుల్లో తారాజువ్వ పడి ఆ ఫ్లాట్ ప్లాస్టిక్ తలుపు కాలిపోయి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

శివ పూజకు వేళాయె..

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు



సీతంపేట గణేష్‌నగర్‌లో పార్వతీశ్వరాలయం



రామకృష్ణానగర్‌లో రామలింగేశ్వరాలయం

సీతంపేట: మహాశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ప్రారంభమైంది. కార్తీక మాస శుద్ధ పాఢ్యమి మంగళవారం నుంచి ఆరంభం కానుంది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తారు. పరమ పవిత్రమైన కార్తీక మాసమంతా శివుడు కై లాసాన్ని వదిలి భూలోకంలో విహరిస్తారని, భక్తిశ్రద్ధలతో శివయ్యను పూజిస్తే కై లాస ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలకు దేవదాయ శాఖ పరిధిలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. నాలుగు సోమవారాలు, పౌర్ణమి, ద్వాదశి, పాఢ్యమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్వతీశ్వరాలయ విశిష్టత

జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లో 1991లో పార్వతీశ్వరుల విగ్రహాలను గ్రామస్తులు ప్రతిష్ఠించారు. నాటి నుంచి నిత్య పూజలు, పండగలు, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ ప్రదక్షిణ భాగంలో పంచభూత శివలింగాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో శివక్షేత్రాలైన ద్వాదశ జ్యోతిర్లింగాలను, పంచభూత శివలింగాలను భక్తులు దర్శిస్తుంటారు. ఇవన్నీ వేర్వేరు రాష్ట్రాల్లో ఉండటంతో సామాన్య భక్తులు వీటిని దర్శించడం కష్టమైన పని. ప్రముఖ శివ క్షేత్రాలను దర్శించిన అనుభూతి కలిగేలా ఆలయ అర్చకుడు గంగవరపు శివాజీశర్మ దాతల సహాయంతో ఆలయంలో వీటిని తీర్చిదిద్దారు. దేవాలయ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న 12 అడుగుల ఎత్తయిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వినాయకుడు, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, సీతారాములు, నవగ్రహాలు, కాలభైరవుడు, నాగ బంధనం, మహిళలు ఎంతో భక్తితో పూజించే రావి, వేప బంధనాల చెట్లు, ఉసిరి, జమ్మి, మారేడు, కదంబ చెట్లు ఆలయ ఆవరణలో ఉన్నాయి.

➡ కార్తీక మాసంలో ప్రతి రోజూ రుద్ర హోమం, సాయంత్రం మేళతాళాలతో ఆకాశ దీపం, ఏక, కుంభ, పంచ, నక్షత్ర హారతుల కార్యక్రమాలు జరుగుతాయని అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు. రూ.250 రుసుంతో భక్తుల గోత్రనామాలతో నాలుగు సోమవారాలు పూజలు చేస్తామని ఈవో ఆలయ ఈవో రమాభాయి వెల్లడించారు. నెలంతా నిత్య పూజ, గోత్రనామాలతో జలాభిషేకానికి రూ.150 చెల్లించాలన్నారు.

విశిష్ట దేవాలయం రామలింగేశ్వరాలయం

జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్ రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం ఎంతో విశిష్ట దేవాలయంగా పేరుగాంచింది. 1971లో గ్రామస్తులు ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగ దర్శనంతో భక్తులు దీపాలు వెలిగించేందుకు, దీప, సాలిగ్రామ దానాలు ఇచ్చేందుకు వీలుగా విశాల మండపం, నవగ్రహాలు, నాగబంధనం, రావి చెట్టు, జమ్మి చెట్టు, ఉసిరి చెట్టు ఆలయంలో కొలువుదీరాయి. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు, దీపారాధనకు వీలు కల్పిస్తున్నారు.

➡ కార్తీక మాసంలో ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు బొంతల కోటి యతిరాజుచే హరికథా కాలక్షేపం ఏర్పాటు చేసినట్లు ఈవో రమాభాయి తెలిపారు. గోత్రనామాలతో నాలుగు సోమవారాలు అభిషేకానికి రూ.250, నెలంతా నిత్య పూజకు రూ.300 రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

➡ పార్వతీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు ప్రారంభిస్తున్నట్టు ఈవో రమాభాయి తెలిపారు.

శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వరాలయంలో..

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని సూర్యనారాయణ, సీతారామలక్ష్మణ, హనుమాన్ సహిత శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ్ శర్మ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి రుద్రాభిషేకం, ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ దీపారాధన జరుగుతాయన్నారు. 20న మొదటి సోమవారం ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, 26న ఆదివారం సాయంత్రం 7 గంటలకు జ్వాలాతోరణం, డిసెంబర్ 1న సంకటహరణ చతుర్థి సందర్భంగా ఉదయం 9 గంటలకు లక్ష్మీగణపతి హోమం, 6న బుధవారం సాయంత్రం 7 గంటలకు మహాలింగ ప్రస్తార దీపోత్సవం, 8న శుక్రవారం ఉదయం 8 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 12న మంగళవారం ఉదయం 9 గంటలకు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్తీక పూజలకు సర్వం సిద్ధం

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మురళీనగర్ రామాలయం ప్రాంగణంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, సత్యానగర్–1లోని సోమేశ్వర స్వామి ఆలయాలను కార్తీక పూజలకు సిద్ధం చేశారు. ఈ మాసంలో భక్తులు అత్యధిక సంఖ్యలో ఇక్కడికి వస్తారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పీఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పూజలు జరుగుతా యి. మంగళవారం నుంచి ఈ నెల రోజుల పాటు ప్రాతఃకాల అర్చన, పంచామృతాభిషేకం, నిత్య ఏకవార అభిషేకాలు, ఆకాశ దీప వ్రతం, రుద్రాభిషేకాలు చేస్తామని, మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీప వ్రతం ప్రారంభిస్తామని ఈవో చెప్పారు. మురళీనగర్ రామాలయంలో ప్రతి రోజు ఆకాశ దీపారాధన జరుగుతుంది.

నేటి నుంచి పౌర గ్రంథాలయ వారోత్సవాలు



ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీ

సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు గ్రంథాలయ వ్యవస్థాపకుడు మట్టా వరహాలుశెట్టి చిత్రపట ఆవిష్కరణతో వారోత్సవాలు ప్రారంభవుతాయని చెప్పారు. 15వ తేదీ సాయంత్రం సహృదయ సాహితి సంస్థ కవి సమ్మేళనం, 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశాఖ సాహితి అఖిల భారతీయ సాహిత్య పరిషత్ క్విజ్ పోటీ, 17వ తేదీ సాయంత్రం విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో కథా రచయితల గోష్టి, 18వ తేదీ సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్‌చే వినోద వల్లరి, 19వ తేదీ ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చలన చిత్ర ప్రదర్శన, 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు గీత్ సంగీత్ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి జరుగుతాయని తెలిపారు. సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టీఎస్సార్ కాంప్లెక్స్‌లో పుస్తక ప్రదర్శన

సీతమ్మధార: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుంచి 20 వరకు నాటకాల సాహిత్య పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. రంగసాయి నాటక గ్రంథాలయంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాటకాలు, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విశాఖ ప్రజలు, నాటక అభిమానులు, బాలబాలికలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'గ్రీవెన్స్'కు వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవ సదస్సు

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న బుల్లయ్య కళాశాల వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, సాధికారతపై సంకల్పం లేని అనే అంశంపై ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందన్నారు. దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ, ప్రజా కవి జయరాజు, రిమ్స్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ తెన్నేటి జయరాజు హాజరు కానున్నట్టు చెప్పారు. సదస్సుకు ముందు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీ చేస్తున్నాన్నారు. దళిత బహుజనులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్డులోని రామకృష్ణానగర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొడ్డేటి కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

వీజేఎఫ్ సభ్యత్వ రెన్యువల్ గడువు పొడిగింపు

అల్లిపురం: వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం(వీజేఎఫ్) సభ్యత్వ రెన్యువల్ గడువు కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతో పాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం– కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం గరికిపాటిని సత్కరించనున్నారని చెప్పారు.

ఆశ్రమ బాలలకు దీపావళి కానుక



బాలలకు పండ్లు, స్వీట్లు అందిస్తున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కంచరపాలెంలోని ఆనీ హన్నా హోమ్‌ను ప్రతినిధులు సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాలబాలికల కోసం నిర్వాహకురాలు అనురాధకు దీపావళి సామగ్రి, పండ్లు, స్వీట్లు అందించారు. రానున్న కాలంలో ఆశ్రమానికి అవసరమైన ఆర్థిక సాయం చేస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ప్రసాదరాజు, ఉపాధ్యక్షులు ఎం.కోదండం, డి.వరప్రసాద్, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వెంకటేష్, కోశాధికారి కె.వి.వర్మ, కార్యవర్గ సభ్యులు పి.సూరిబాబు, పీఎస్‌ఆర్ శ్రీను, సతీష్, దిల్లేశ్వరరావు, యూవీ సత్యనారాయణ పిల్లలతో దీపావళి వేడుకలు జరిపించారు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం

- వాహనాల సామగ్రి, పెట్రోల్ చోరీ
- పోలీస్ నిఘా పెంచాలని స్థానికుల విజ్ఞప్తి



రేసపువానిపాలెంలో స్కూటీ డిక్కీలో పెట్టిన సామగ్రి మాయమైన దృశ్యం



రేసపువానిపాలెంలో బైక్ పెట్రోల్ పైప్ తొలగించిన దొంగలు



నక్కవానిపాలెంలో దొంగిలించిన ఆటో టైరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అర్ధరాత్రి వేళలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. వాహనం పార్క్‌చేసి కనిపిస్తే చాలు దొరికింది దొంగిలించుకుపోతున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారో.. ఎలా చోరీ చేస్తున్నారో తెలియని పరిస్థితి. అర్ధరాత్రి పూట వీధుల్లో తిరుగుతూ.. ఇళ్ల ముందు, రోడ్లపై పార్క్ చేసిన వాహనాలకు చెందిన సామగ్రి, టైర్లు, పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. తెల్లవారుజామున వాహన యజమానులు నిద్రలేచి చూసే సరికి అవి కనిపించకపోవడంతో లబోదిబోమంటున్నారు. వార్డులోని రేసపువానిపాలెం, నక్కవానిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఇటువంటి చోరీలు జరిగాయి. పార్క్‌చేసి ఉన్న ద్విచక్ర వాహనాల్లోని విలువైన వస్తువులను, పెట్రోల్‌ను, ఆటో టైర్లను మాయం చేశారు. తమ వాహన సామగ్రి దొంగతనానికి గురికావడంతో వాహనదారులు ఆవేదన చెందారు. రాత్రి పూట పోలీస్ గస్తీ ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగుతుండటంపై నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, సీతమ్మధార, గాంధీనగర్, క్రాంతినగర్, 60 ఫీట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ తరహా చోరీలు జోరుగా సాగుతున్నాయి. పోలీస్ అధికారులు, క్రైం విభాగం అధికారులు దృష్టి సారించి ఈ దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ప్రత్యంగిరా భద్రకాళి హోమం



లలితా పీఠంలో హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: అమావాస్య సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో సోమవారం ఉదయం ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం లలితా పీఠంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీఠం ఆవరణలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తీక మాసం నెల రోజులు ప్రతి రోజూ సాయంత్రం కాళీ కాలభైరవులకు ఏకవార పంచామృత అభిషేకం జరుగుతుందని, పాల్గొన దలచిన భక్తులు లలితా పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కృష్ణసేన్ కోరారు.

ఫ్యాన్సీ డ్రెస్ పోటీలకు ఆహ్వానం

మర్రిపాలెం: తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న బాలల దినోత్సం రోజున ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ (మాధవధార) అధ్యక్షురాలు ఎం.శేషమణి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. మాధవధార లోని జీవీఎంసీ పాఠశాలలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధు లు, సూపర్‌హీరోల వేషధారణలో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. అనతరం మాధవధార 48ఏ బస్టాప్ రోడ్డులోని ఈస్ట్ పార్కులో జరిగే బాలల దిన వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను 94928 73277 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

టిఫిన్ షాప్‌లో చెలరేగిన మంటలు



టిఫిన్ షాప్‌లో ఎగసిపడుతున్న మంటలు

మురళీనగర్/మర్రిపాలెం: మురళీనగర్ మెయిన్ రోడ్డు సాయి కాంప్లెక్స్‌లోని డీఎఫ్‌సీని ఆనుకుని ఉన్న మిల్లెట్ టిఫిన్ సెంటర్‌లో సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. షాప్ వంట గది నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. మంటలు ఎక్కువ కావడంతో స్థానికులు బర్మా క్యాంప్‌లోని మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.వి.పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. టిఫిన్ షాప్ నిర్వాహకుడు బి.అశ్వనీకుమార్ నుంచి అధికారులు వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఫ్రీజర్, గ్యాస్ స్టవ్, ఏసీ, గ్రైండర్, వంట సామగ్రి కాలిపోయాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని, రూ.లక్షా 50 వేల నష్టం సంభవించినట్లు ఏడీఎఫ్‌వో ప్రసాదరావు తెలిపారు. కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి ప్రమాద ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని ససమీక్షించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక నాయకత్వంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న రాజు గౌడ్

సీతంపేట: రాజకీయ పార్టీలన్నీ ఉత్తరాంధ్రను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కయ్యపాలెం శాంతిపురంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పోరుబాటను ప్రతి పల్లెకు, గ్రామానికి తీసుకెళ్లి ప్రజలను చైతన్య పర్చి, ఉత్తరాంధ్ర ప్రజలు పెత్తనం సాగించే రోజు తీసుకొస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే స్థానిక నాయకత్వానికి అధికారం దక్కాలన్నారు. 2024 ఎన్నికల్లో స్థానికులనే అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉత్తరాంధ్ర యువత, నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

ముగ్గురి మధ్య ఘర్షణ

మర్రిపాలెం: దీపావళి పండగ వేళ.. టపాసులు కాలుస్తుండగా ఇరుగు పొరుగు వారి మధ్య ఘర్షణ జరిగింది. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇందిరానగర్–5లో నివసిస్తున్న దుంగ ఈశ్వరరావు ఆదివారం రాత్రి టపాసులు కాలుస్తున్నాడు. ఇరుగున ఉండే ఇద్దరు వ్యక్తులు అశోక్, మూర్తి రాత్రి 9.30 గంటలైనా.. ఇంకా ఎంతసేపు కాలుస్తారని ఈశ్వరరావుతో వారించారు. దీంతో ముగ్గురి మధ్య మాటామాటా పెరిగి కొట్టుకున్నారు. అశోక్, మూర్తిలు క్రికెట్ బ్యాట్‌తో ఈశ్వరరావు తలపై కొట్టి గాయపరిచారు. క్షతగాత్రుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అశోక్, మూర్తికి చిన్న చిన్న గాయాలయ్యాయి. ఈశ్వరరావు వీరిద్దరిపై, వీరు అతడిపై ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



షిర్డీసాయి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతమ్మధార: దీపావళి సందర్భంగా నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో భక్తిశ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బాబా విగ్రహ సన్నిధిలో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్ బాబు, వనజాక్షి, శివ పాల్గొన్నారు.